# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని దసరా పండుగ సందర్భంగా అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- నేపాల్‌లో చిక్కకున్న ఆంధ్రప్రదేశ్ పౌరులను తిరిగి రాష్ట్రానికి సురక్షితంగా తీసుకువచ్చేందుకు అధికారులు నిరంతరాయంగా కృషి చేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు.
- భావితరం జీఎస్టీ సంస్కరణలతో దేశం స్వయం సమృద్ధి సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.
- రాయలసీమలో రానున్న 12 గంటల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.
- ఆసియా కప్‌లో భాగంగా భారత్, యూఏఈ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ రాత్రి 8 గంటలకు ప్రారంభంకానుంది.

=====================

రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు ఆటో మిత్ర పేరిట 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని దసరా పండుగ సందర్భంగా అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అనంతపురంలో ఈరోజు ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సవ సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గత 15 నెలల పాలనలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పేందుకే ఈ విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. సంక్షేమం అంటే బాధ్యతగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే అని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం తెచ్చి మహిళల వంటింటి కష్టాలు తీర్చామని నేడు మళ్లీ దీపం-2 పథకం ద్వారా ఏటా ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. రైతన్నకు అండగా ఉండేందుకే అన్నదాత సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చామని, కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఏడాదికి 3 విడతల్లో 20 వేల రూపాయలను ఇస్తామన్నారు. తొలి విడతగా ఇప్పటికే 7 వేల రూపాయలు ఇచ్చామన్నారు. ఎనికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆటో డ్రైవర్లకు కూడా దసరా రోజున ఆటో మిత్ర పేరిట 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

ఇక ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సూపర్ సిక్స్ హామీలతో ఎన్నికల్లో ఘన విజయం సాధించామన్నారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికీ 25 లక్షల రూపాయల ఆరోగ్య బీమా అందించేలా ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుందని చెప్పారు. 4 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లను గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించామని, పీఎం జన్ మన్ పథకం ద్వారా 625 గిరిజన గ్రామాలను అనుసంధానించి 1005 కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణం చేపడుతున్నామని పవన్ కళ్యాణ్ తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=====================

నేపాల్‌లో కొనసాగుతున్న ఘర్షణల మధ్య అక్కడ చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ పౌరులను తిరిగి రాష్ట్రానికి సురక్షితంగా తీసుకురావడానికి అధికారులు నిరంతరాయంగా కృషి చేయాలని ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (RTGS) కంట్రోల్ రూమ్ నుండి మంత్రి లోకేష్ ఢిల్లీలోని ఏపీ భవన్, విదేశాంగ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. 215 మందికి పైగా ఆంధ్రప్రదేశ్ నివాసితులు నేపాల్‌లో చిక్కుకున్నారని, ఖాట్మండు విమానాశ్రయం తిరిగి తెరిచిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక విమానాల ద్వారా వారిని తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రజా సంబంధాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మరికొంత మందిని భారత సరిహద్దుల గుండా తరలించేలా ప్రత్యామ్నాయాలు చేస్తోందని వెల్లడించింది. నేపాల్ లో చిక్కుకున్న రాష్ట్ర పౌరులు ఎవరైనా అత్యవసర సహాయం కోసం ఢిల్లీలోని ఏపీ భవన్ ఫోన్ నెం +91 98183 95787ని సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొంది.

విరామం

=====================

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భావితరం జీఎస్టీ సంస్కరణలతో దేశం స్వయం సమృద్ధి సాధిస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతపురంలో ఈరోజు జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ... జీఎస్టీ సంస్కరణలతో వ్యవసాయం, వైద్య రంగానికి సంబందించిన వస్తువులతో పాటూ ఆహార, పానీయ ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయని చెప్పారు. ఈ జీఎస్టీ సంస్కరణలతో ఆత్మనిర్భర భారత్ కల సాకారమవుతుందని... ఆ దిశగా దేశ ప్రజలు కూడా స్వదేశీ ఉత్పత్తులకే అధిక ప్రాధాన్యమివ్వాలని మాధవ్ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

=====================

వాణిజ్య బ్యాంకులకు ధీటుగా పోస్టల్ శాఖ అన్ని వర్గాల ప్రజలకు నిరంతరాయ సేవలు అందిస్తోందని శ్రీకాకుళం హెడ్ పోస్ట్ మాస్టర్ పడాల రంగారావు తెలిపారు. ఈరోజు ఆయన పోస్టల్ కార్యాలయంలో ఆకాశవాణితో మాట్లాడుతూ... వాణిజ్య బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీలు ఇస్తున్న ఘనత పోస్టల్ శాఖకే దక్కుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు అన్నీ పోస్టల్ కార్యాలయాల ద్వారా సామాన్యులకు అందిస్తున్నామని వెల్లడించారు. బాలికల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన మెరుగైన ఆరోగ్య సంరక్షణతో పాటు.. వారి భవిష్యత్ అవసరాలకు ఎంతో తోడ్పాటును అందిస్తుందని స్పష్టం చేశారు.

=====================

ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో వ్యాధుల నివారణ, చికిత్సలు, పునరావాసం వంటి సేవలు ఉచితంగా లభిస్తాయని ఈ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సూచించారు. అమలాపురం ఈడబ్ల్యూఎస్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సమకూర్చిన వసతుల ద్వారా మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్య విధానం సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను స్థానికంగా ప్రజలకు అందించడమే ముఖ్య లక్ష్యంగా రూపొందించబడిందన్నారు.

=====================

ఉత్తర కోస్తాంధ్ర తీర ప్రాంతములో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా దక్షిణ కర్ణాటక నుండి తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉపరితల ద్రోణి సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని వెల్లడించింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాంధ్ర లో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు పలు చోట్ల భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. ముఖ్యంగా ఏలూరు, అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదే విధంగా రాయల సీమలో రానున్న 12 గంటల్లో 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

=====================

ఆసియాకప్ 2025లో భాగంగా భారత్, యూఏఈ జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ ఈరోజు రాత్రి 8 గంటలకు ప్రారంభంకానుంది. గ్రూప్ ఏ లో భాగమైన ఇరు జట్లు తమ తొలి మ్యాచ్ ను దుబాయ్ లోని ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా ఈరోజు ఆడనున్నాయి. ఈ టోర్నమెంట్ లో మొత్తం 8 జట్లు రెండు గ్రూపుల వారీగా పోటీ పడుతున్నాయి. రెండు గ్రూపులలో తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు సూపర్4 కి అర్హత సాధిస్తాయి.

=====================

తిరుమలలో భక్తుల సూచనలను పరిగణనలోకి తీసుకొని మరింత మెరుగైన సేవలు అందిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కార్యనిర్వాహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ఈరోజు ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. అలిపిరి మెట్ల మార్గంలో భక్తులతో నేరుగా మాట్లాడానని లడ్డూ, అన్నప్రసాదం నాణ్యతా చాలా బాగుందని వారు సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు.

=====================

=====================